

ఉత్సాహంగా ముగ్గు వేస్తున్న బాలిక









మంత్రముగ్ధంగా రంగవల్లులు

సంక్రాంతి పండుగను 'సాక్షి'వారం రోజుల ముందుగానే తీసుకొచ్చింది. రంగు రంగుల రంగవల్లికలను రంగరిస్తు.. చుక్కలను పేరుస్తూ.. చిన్నారులు, మహిళలు వేసిన ముగ్గులు చూపరులను మంత్రముగ్ధులను చేశాయి. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం భాగ్యలక్ష్మికాలనీలోని నేతాజీ హై స్కూల్, 'సాక్షి'మీడియా గ్రూపు సంయుక్త ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమం ఆద్యంతం పండుగ వాతావరణం నెలకొంది.



ఉత్సాహంగా ముగ్గు వేస్తున్న బాలిక

ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు



మొదటి బహుమతిని లావణ్యకు అందజేస్తున్న పేట్‌బషీరాబాద్ ఎస్సై సరిత, దీప



రెండో బహుమతిని టి.సరితకు అందజేస్తున్న మహేష్‌కుమార్, వరప్రసాద్



మూడో బహుమతిని శ్యామలకు అందజేస్తున్న చింతల మల్లేశంయాదవ్, రవి



కన్సొలేషన్ బహుమతిని అందజేస్తున్న మహేష్ కుమార్

కుత్బుల్లాపూర్: భాగ్యలక్ష్మికాలనీలోని నేతాజీ హై స్కూల్‌లో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ముగ్గుల పోటీలు జరిగాయి. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల నుంచి సుమారు 100 మందికి పైగా మహిళలు హాజరయ్యారు. విద్యార్థినులు, మహిళలు వేసిన రంగవల్లికలు చూపరులను ఆకర్షించాయి. పాఠశాల కరస్పాండెంట్ చింతల మహేష్‌కుమార్ యాదవ్, నందిని దంపతులు అన్ని తామై వ్యవహరించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మహిళలు వేసిన ముగ్గులను పరిశీలించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యూష, జ్యోతి, సంతోషి, స్నేహ న్యాయ నిర్ణయాలుగా వ్యవహరించి ఫలితాలను వెల్లడించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు, సంక్రాంతి వేడుకల విశిష్టతను తెలిపే విధంగా విద్యార్థులు వేసిన స్కిట్లు ఎంతో ఆకట్టుకున్నాయి.

ముగ్గుల పోటీల విజేతలు వీరే...

భాగ్యలక్ష్మికాలనీ నేతాజీ స్కూల్‌లో జరిగిన సంక్రాంతి ముగ్గుల పోటీల్లో పాల్గొన్న ప్రతి మహిళకు కన్సొలేషన్ బహుమతులు అందజేశారు. పేట్‌బషీరాబాద్ ఎస్సై సరిత చేతుల మీదుగా లావణ్య (ప్రథమ), చింతల మల్లేశం యాదవ్ చేతుల మీదుగా టి.సరిత (ద్వితీయ), మహేష్‌కుమార్ చేతుల మీదుగా శ్యామల(తృతీయ) బహుమతులను అందుకున్నారు.

పలువురికి చీరలు అందజేత...

అదే విధంగా ప్రత్యేక కన్సొలేషన్‌లుగా పార్వతి, సుధారాణి, సత్యమణిని ఎంపిక చేసి వారికి చీరలను అందజేశారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ అధ్యక్షుడు వరప్రసాద్, ఆర్గనైజర్ రవికుమార్, కుత్బుల్లాపూర్ సాక్షి జోన్ ఇంచార్జి రంగు వెంకటేష్‌గౌడ్, జోన్ అడ్వర్టైజ్‌మెంట్ మేనేజర్ గణేష్, పోలీసు అధికారి దీప, నందిని, మానస్, సాక్షి ప్రతినిధులు తదితరులు పాల్గొని పలువురు మహిళలకు బహుమతులు ప్రదానం చేశారు.







ముగ్గుల పోటీల్లో కన్సొలేషన్ బహుమతులు పొందిన మహిళలు

చివరిరోజు 5989 దరఖాస్తులు

కుత్బుల్లాపూర్: గాజులరామారం, కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్ల పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో శనివారంతో ముగిసింది. అభయహస్తం దరఖాస్తులు అందజేసేందుకు చివరి రోజు కావడంతో పలు బస్తీలు, కాలనీల ప్రజలు ఆయా వార్డు కార్యాలయాల వద్ద క్యూలైన్‌లు కట్టారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ రంగారెడ్డినగర్ డివిజన్‌లో 1125, సుభాష్‌నగర్ డివిజన్‌లో 1713, కుత్బుల్లాపూర్ డివిజన్‌లో 1652, జీడిమెట్ల డివిజన్‌లో 1499 మొత్తం 5989 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

జగద్గిరిగుట్ట: ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్‌నెస్ ఆధ్వర్యంలో మగ్దూంనగర్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్పొరేటర్ కె.జగన్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానికులకు ఉచితంగా షుగర్, బీపీ, ఇతర సాధారణ పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గీత, బీఆర్ఎస్ నాయకులు టి.యాదగిరి, విఠల్ ముదిరాజ్, పి. నరసింహారెడ్డి, బాలు, మైలారం రాజు పాల్గొన్నారు.

11న ముగ్గుల పోటీలు

జగద్గిరిగుట్ట: భారత జాతీయ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదిన ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నట్లు మహిళా సమాఖ్య కార్యదర్శి హైమావతి ఓ ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి సందర్భంగా ప్రతి సంవత్సరం ఎన్ఎఫ్ఐడబ్ల్యూ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. 11వ తేదీన ఉదయం 11గంటలకు జగద్గిరిగుట్ట సీపీఐ కార్యాలయ ఆవరణలో ముగ్గుల పోటీలు ఉంటాయని తెలిపారు. మహిళలు పెద్ద ఎత్తు పాల్గొనాలని కోరారు.

గురుకుల ప్రవేశ పరీక్ష దరఖాస్తునకు 15వ తేదీ ఆఖరు

రాయదుర్గం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రతిభ కళాశాలల్లో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకొనే గడువు తేదీ ఈనెల 15 అని గౌలిదొడ్డి గురుకుల బాలికల కళాశాల ప్రిన్సిపల్ ఏ శారద తెలిపారు.2024–25 విద్యాసంవత్సరానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని 38 సోషల్ వెల్ఫేర్ ప్రతిభ కళాశాలల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ వంటి కోర్సులలో ప్రవేశం కోసం అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా స్వీకరించడం జరుగుతుందన్నారు .ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఏరోట్రాన్ హ్యాకథాన్



హ్యాకథాన్‌లో పాల్గొన్న విద్యార్థులు

దుండిగల్: దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఏరో ట్రాన్ హ్యాకథాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. హ్యాకథాన్‌లో రాష్ట్రంలోని పలు ఇంజినీరింగ్ కళాశాలల నుంచి దాదాపు 50 గ్రూపులుగా ఏర్పడి విద్యార్థులు పాల్గొన్నారు. 36గంటల పాటు జరిగిన ఈవెంట్‌లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ మర్రి శ్రేయారెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు, డీన్ రాధికాదేవి, హెచ్ఓడీ సత్యనారాయణగుప్తా తదితరులు పాల్గొన్నారు.

బెటాలియన్‌లో అట్టహాసంగా క్రీడా పోటీలు

గచ్చిబౌలి: ఉత్సాహంగా, ఉల్లాసంగా క్రీడాపోటీలు సాగాయి. కొండాపూర్‌లోని 8వ బెటాలియన్ ప్రాంగణంలో బి కంపెనీ వార్షిక రిఫ్రెషర్ కోర్సులో భాగంగా బెటాలియన్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ కార్యక్రమాన్ని బెటాలియన్‌లోని కవాతు మైదానంలో శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కమాండెంట్ సి సన్నీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. క్రీడాకారులు ఆయనకు గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పోర్ట్స్ వల్ల మానసిక ప్రశాంతత, దేహదారుఢ్యం పొందుతారన్నారు. కార్యక్రమంలో బెటాలియన్ అదనపు కమాండెంట్ బి రామకృష్ణ, సహాయ కమాండెంట్ డి సత్యనారాయణ, కమాండర్ ఎస్‌వి ఆదినారాయణరెడ్డి, పాల్గొన్నారు.

గ్రానైట్ మీద పడటంతో ఇద్దరు కూలీలు మృతి





మృతి చెందిన సీతాశరణ్, లఖన్

కుత్బుల్లాపూర్: గ్రానైట్ మీద పడటంతో అపస్మారకస్థితికి చేరుకున్న ఇద్దరు కూలీలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 5వ తేదీ రాత్రి 10గంటలకు గుజరాత్ నుంచి (ఎంహెచ్ 24ఏబీ 8157) లారీలో గ్రానైట్ లోడు కొంపల్లిలోని ఆర్ఆర్ఆర్ కన్స్‌స్ట్రక్షన్‌కు వచ్చింది. మధ్యప్రదేశ్‌కు చెందిన సీతాశరణ్(45), జార్ఖండ్‌కు చెందిన లఖన్(25)లు లారీ పైకి ఎక్కి దించేందుకు గ్రానైట్‌ను సపోర్ట్‌గా కర్రలను తొలగించారు. ఈ క్రమంలో ఓ వైపుగా ఉన్న గ్రానైట్ ఒక్కసారిగా వీరిద్దరిపై పడింది. దీంతో గ్రానైట్ మధ్య ఇరుక్కుని ఊపిరాడకపోవడంతో అపస్మారకస్థితికి చేరుకున్నారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, మిగతా కూలీల సహాయంతో వారిద్దరిని బయటకు తీసి శ్రీకర ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న సీతాశరణ్, లఖన్‌ల పరిస్థితి విషమించడంతో శనివారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటింటికీ అయోధ్య రామయ్య అక్షింతలు



బాచుపల్లి హిల్‌కౌంటీలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో రామయ్య అక్షింతలు పంపిణీ



నిజాంపేట్: బాచుపల్లి హిల్‌కౌంటీలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి రాజీవ్‌గాంధీ సంచాలన సమితి కమిటీ ఆధ్వర్యంలో శనివారం అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను పంపిణీ చేపట్టారు. రాజీవ్‌గాంధీనగర్, పూజిత ఎన్‌క్లేవ్, సత్యంవ్యాలీ, సత్యం హైట్స్, విస్పర్‌వ్యాలీ, జయదీపిక ఎస్టేట్స్, ఎస్వీఎస్ ఆభరణ కాలనీ, ఇందిరనగర్, కాకతీయ కాలనీ, కేజీఎం కాలనీ, శ్రీనిధి హిల్స్ పార్క్ తదితర ప్రాంతాల్లో మేళ తాళాలు, భజాభజంత్రీల మధ్య అక్షింతలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజీవ్‌గాంధీ సంచాలన సమితి కమిటీ సంయోజక్ రామచంద్రనాయక్, సాహసం చిత్ర మ్యూజిక్ డైరెక్టర్ శ్రీనివాస్‌రావులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

- **నిజాంపేట్ మేయర్‌కు రామయ్య అక్షింతలు**

నిజాంపేట్: శ్రీరాముడి అక్షింతలు ఎంతో పవిత్రమైనవని.. ప్రతి ఇంట్లో పూజా గదిలో ఉంచి పూజించాలని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. అయోధ్య రామమందిరం నుంచి తీసుకొచ్చిన అక్షింతలను రాజీవ్‌గాంధీ సంచలన సమితి కమిటీ సభ్యులు శనివారం మేయర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... శ్రీరాముడి అక్షింతలు పొందడం ఎంతో అదృష్టమని, భారతీయులకు ఆయన ఆదర్శ పురుషుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సుబ్బారెడ్డి, సుదర్శన్‌రెడ్డి ఉన్నారు.

తగ్గని వీధి కుక్కల బెడద

- బండారి లేఅవుట్‌లో తండ్రీకూతురిపై దాడి
- ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైనం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నరేష్ (ఇన్‌సెట్‌లో కాలికి గాయమైన దృశ్యం)

నిజాంపేట్: వీధి కుక్కల బెడదను అరికట్టడంతో అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో ఓ తండ్రి, కూతురు వీధి కుక్క కాటు బారిన పడ్డారు. నిజాంపేట్ బండారి లేఅవుట్‌కు చెందిన ప్రైవేట్ ఉద్యోగి నరేష్‌కుమార్(40), కుమార్తె(05)ను తీసుకుని శనివారం సాయంత్రం మెయిన్ రోడ్డులో బైక్‌పై వెళ్తున్నారు.

◆ ఈ క్రమంలో నిజాంపేట్ డిమార్ట్ సమీపంలో వీధి కుక్క వీరి బైక్‌ను వెంబడించింది. దాని నుంచి తప్పించుకునేందుకు బైక్ వేగం పెంచినా వెంబడించి మరీ వారిపై దాడి చేసింది. ఈ ఘటనలో నరేష్‌కుమార్ కాలి కింద భాగంగా తీవ్ర గాయం కాగా, కుమార్తెకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులు స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

◆ ఇటీవలే బండారి లేఅవుట్‌లో కుక్కల దాడిలో పలువురు గాయపడిన ఘటన మరువక ముందే తాజాగా మరో ఘటన చోటు చేసుకోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ ప్రాంతంలో గుంపులు గుంపులుగా తిరుగుతున్న వీధి కుక్కల విషయమై కార్పొరేషన్ అధికారులకు ఎన్నిమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు పేర్కొంటున్నారు. కుక్కల దాడి జరిగిన సమయంలోనే హడావుడి చేసి ఆపై పట్టించుకోవడం లేదని, కార్పొరేషన్ వెటర్నరీ సిబ్బంది ఏం చేస్తున్నారని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



ప్రమాదంలో మృతిచెందిన అర్జున్

జీడిమెట్ల: గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన సంఘటనలో ఓ ప్రైవేట్ ఉద్యోగి మృతిచెందిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసరావు వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్ట అల్విన్ కాలనీకి చెందిన అర్జున్(32) సుభాష్‌నగర్‌లోని ఓ ప్రింటింగ్ ప్రెస్‌లో పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి 8.30గంటలకు విధులు ముగించుకుని షాపూర్‌నగర్ నుంచి జగద్గిరిగుట్టకు వెళ్లే పైప్‌లైన్ రోడ్డులో వెళ్తున్నాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అర్జున్ అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. అర్జున్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

మహిళ అదృశ్యం



శ్యామల (ఫైల్)

జీడిమెట్ల: ఓ మహిళ అదృశ్యమైన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై నాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. గాజుల రామారం డివిజన్ నెహ్రూనగర్‌కు చెందిన ప్రశాంత్, శ్యామల(31) భార్యాభర్తలు. వారం రోజులక్రితం ప్రశాంత్ పని నిమిత్తం ఇతర ప్రాంతానికి వెళ్లాడు. ప్రశాంత్ లేని సమయంలో అతని భార్య శ్యామల భర్తకు ఫోన్ చేసింది. ఓ గుర్తు తెలియని వ్యక్తి కాల్‌చేసి రూ.40వేలకు తులం బంగారం ఇస్తానని నమ్మబలికాడని చెప్పింది. దీంతో సదరు వ్యక్తికి ఇంట్లో ఉన్న రూ.6.5 లక్షలతో పాటు రూ.85వేలు ఆర్‌టీజీఎస్ ద్వారా పంపించానని తెలిపింది. దీంతో ప్రశాంత్ తాను ఊరి నుంచి రాగానే పోలీసులకు ఫిర్యాదు చేద్దామని భర్త భార్యకు తెలిపాడు. ప్రశాంత్ ఈనెల 3వ తేదీన ఇంటికి వచ్చే సరికి ఇంట్లో శ్యామల కనిపించలేదు. ఇంట్లో ఉంచిన బంగారం సైతం కనిపించలేదు. ప్రశాంత్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్‌ను సత్కరిస్తున్న మహదేవపురం వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

సుభాష్‌నగర్: సంక్షేమ సంఘాలు అభివృద్ధిలో భాగస్వాములు కావాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. శనివారం షాపూర్‌నగర్‌లోని నివాసంలో మహదేవపురం వెల్ఫేర్ సొసైటీ నూతన కమిటీ సభ్యులు శ్రీశైలంగౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసోసియేషన్‌కు తన పూర్తి మద్దతు ఉంటుందన్నారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. సొసైటీ ప్రెసిడెంట్ వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్‌లు జగదీశ్‌రెడ్డి, రంగారావు, సంయుక్త కార్యదర్శులు రామచంద్రారెడ్డి, ప్రవీణ్, సభ్యులు దేవేందర్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కృష్ణారెడ్డి, నరేందర్‌రెడ్డి ఉన్నారు.

వేంకటేశ్వరస్వామికి లక్ష పుష్పార్చన





ధనుర్మాసం దశమి రోజును పురస్కరించుకుని కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పద్మానగర్ ఫేజ్–1లోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం లక్ష పుష్పార్చన నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. – జగద్గిరిగుట్ట

రోబోటిక్స్ ఈవెంట్ షురూ..



రోబోటిక్స్ ఈవెంట్‌ను ప్రారంభిస్తున్న ట్రస్ట్ సభ్యుడు రాజశేఖర్, డైరెక్టర్ కోడాలి విజయరాణి

నిజాంపేట్: బాచుపల్లిలోని వీఆర్ఎస్ విజ్ఞాన జ్యోతి పాఠశాలలో శనివారం రెండు రోజుల పాటు జరిగే సౌత్ ఇండియా రోబోటిక్స్ ఈవెంట్‌ను పాఠశాల ట్రస్ట్ సభ్యుడు వల్లూరిపల్లి రాజశేఖర్, డైరెక్టర్ శ్రీమతి కొడాలి విజయరాణి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. దాదాపు 500 మంది విద్యార్థులు పాల్గొనగా రోబోటిక్స్ ఫీల్డ్‌లో నిష్ణాతులైన 20 మంది కళాశాల నిపుణులు పర్యవేక్షణలో ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ... నేడు వైద్యం, విద్య, పారిశ్రామిక రంగాల్లో రోబోటిక్స్ ప్రాధాన్యత ఎంతో పెరిగిందన్నారు. విద్యార్థులు భవిష్యత్‌ను నిర్ణయించుకునే వినూత్న పద్ధతుల్లో నూతన ఆవిష్కరణలు చేపట్టాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ చలసాని సాయాజీరావు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

మూత్రశాలల వద్ద వంట చేసుకుంటున్న దృశ్యం



ఆకలి రుచి ఎరగదు.. నిద్ర చోటు ఎరగదు.!

జీడిమెట్ల: ఆకలి రుచి ఎరగదు.. నిద్ర చోటు ఎరగదు.! అనే పెద్దల మాటకు పై చిత్రం సరితూగుతుంది. మహబూబ్‌నగర్ జిల్లా (కొల్లాపూర్) నుంచి కొంతమంది బంజారా కూలీలు జీడిమెట్ల పారిశ్రామికవాడలో రోడ్డు పనులు చేసేందుకు కూలీలుగా వచ్చారు. వీరంతా కుటుంబంతో ఉండటానికి చోటు లేక పారిశ్రామిక ప్రాంతంలో నిర్మించిన వాడకంలో లేని మూత్రశాలలను శుభ్రం చేసుకుని అందులో ఉంటున్నారు. వీరంతా అక్కడే వంట చేసుకుని బాత్రూంలలో పడుకోవడం చూసిన వారు పాపం అంటున్నారు. కనీసం వీరిని తీసుకువచ్చిన గుత్తేదారు వీరికి ఆశ్రయం కల్పించకపోవడం దారుణం.